క్లుప్తంగా

అలరించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు



శ్రీహరి కళాతోరణ వేదికపై చిన్నారుల భరత నాట్య ప్రదర్శన

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధర్మ ప్రచార మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై నిత్యం జరుగుతున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. బుధవారం శ్రీహరి కళాతోరణ వేదికపై పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

ములగలంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు గంటసాల గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ కె.గంగాధర రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కేంద్రాల్లో కామన్ రకం 75 కేజీలు రూ. 1637, గ్రేడ్-ఏ రకం 75 కేజీలు రూ.1652 మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాలకు న్యాయం తీసుకువచ్చే రైతులు 17 శాతం తేమ ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

పోలవరం రూరల్: పోలవరం సచివాలయం-1 పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దత్తి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు బండారు అప్పారావు, ఎంపీటీసీలు కాశీ ధనలక్ష్మి, యామల శ్రీదేవి, పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలు, సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు అందరూ హాజరుకావాలని కోరారు.

9న జాతీయ లోక్‌అదాలత్

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలన్నారు. డిసెంబర్ 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరి కేసులు, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు, మున్సిపాలిటీ పన్ను బకాయి కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని చెప్పారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతి రోజూ కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాచారం కోసం దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వినతుల స్వీకరణ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన గిరిజన దర్బారులో ఐటీడీఏ పీఓ ఎం. సూర్యతేజ వినతిపత్రాలను స్వీకరించారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరుకు సంబంధించిన పలువురు వివిధ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. బుట్టాయగూడెం మండలం వీరమద్దిగూడెం గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆ గ్రామ గిరిజనులు వినతిపత్రాన్ని అందించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు

బుట్టాయగూడెం: తెలంగాణ రాష్ట్రంలో గురువారం ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో బుధవారం జీలుగుమిల్లి సమీపంలోని అంతరరాష్ట్ర సరిహద్దులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలతో పాటు ఇతర వాహనాలను కూడా పరిశీలించిన తర్వాతే తెలంగాణ రాష్ట్రానికి వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. సీఐ బి. వెంకటేశ్వరరావు, ఎస్సై ఐ. చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పోలవరం రూరల్: మండలంలోని ఎన్‌టీఆర్ కాలనీలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. తుమరాడ శ్రీనివాసరావు, లింగోజు పోసిబాబు, పసుపులేటి శ్రీనివాసరావు, యామల తాత బ్రహ్మం, వాసుదేవ సత్యనారాయణ, బిల్లగుర్తు వెంకటరత్నం పాల్గొన్నారు.



చింతలపూడి: మల్లాయగూడెంలో జగనన్న కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: రాజానగరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తున్న పార్టీ నేతలు



లింగపాలెం: కొత్తపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



పోలవరం రూరల్: ప్రగఢపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల: పి.కన్నాపురంలో అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వాసు, పార్టీ నాయకులు

గ్రామాల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

టి.నరసాపురం: గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని ఏపుగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన లేఅవుట్ కాలనీలో ఇళ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. అలాగే కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి పార్టీ దిమ్మను, జెండాను ఆవిష్కరించారు. లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభలో బాలరాజు మాట్లాడుతూ ఏపుగుంటలో రూ.82 కోట్ల అభివృద్ధి పనులు జరిగినట్లు వివరించారు. గ్రామంలో సంక్షేమ పథకాలకు రూ.22 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 16 గ్రామ పంచాయతీల ప్రజలు లబ్ధి పొందే విధంగా గ్రామంలో రూ.60 కోట్లతో నిర్మించిన 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం సీఎం వర్చువల్‌గా ప్రారంభించినట్లు గుర్తు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయలేకపోయాడని, జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తుంటే సెంటు చాలదని సెంటున్నర ఇవ్వాలంటూ విడ్డూరంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, దేవరపల్లి ముత్తయ్య, బండి సుబ్బారావు మొరవనేని అనిల్, పెదబాబులు, కన్నం సర్వేశ్వరరావు, బొళ్ళ రంగారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆచంట నాగమణి, తేజ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. పరింపూడిలో బుధవారం ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, పార్టీ నాయకులు నూకల రాము, సంకుకొండ, తేలే శ్రీను, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, పల్లంట్ల శ్రీను పాల్గొన్నారు.



టి.నరసాపురం: ఏపుగుంటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పుట్లగట్లగూడెంలో...

జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, బడే సత్యనారాయణ, పార్థసారధి పాల్గొన్నారు.

మల్లాయగూడెంలో...

చింతలపూడి: మల్లాయగూడెంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ డాబి రాంబాబు నాయక్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మండల సచివాలయాల కన్వీనర్ తృల్లాబత్తుల శ్రీనివాసరావు, సర్పంచ్ చీకటి కవిత, పోతునూరు సర్పంచ్ కె లక్ష్మీ ప్రసన్న, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు కందుల గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు.

రాజానగరంలో...

బుట్టాయగూడెం: రాజానగరంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్ కుంజా దుర్గమ్మ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు పార్టీ జెండాను ఎగుర వేశారు. నాయకులు కుంజా ప్రసాద్, ములగల నాగేశ్వరరావు, చెరుకూరి దుర్గారావు, రమణ నాగు, కుంజా శిరమయ్య, మడకం రవి, కణితి దుర్గారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన నేతలు

జీలుగుమిల్లి మండలంలో...

జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ, పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మొడియం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే జగనన్న లక్ష్యం

లింగపాలెం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. కొత్తపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, నాయకులు గణేష్, జి.సత్యన్నారాయణ, రావి కొండయ్య పాల్గొన్నారు.

పోలవరం రూరల్: ప్రగఢపల్లి సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పార్టీ జెండాను పార్టీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఎగురవేశారు. అలాగే సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు.

ద్వారకాతిరుమల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పి.కన్నాపురంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నేతలతో కలసి వైఎస్సార్ సీపీ జెండాను, అభివృద్ధి పథకాల బోర్డును వాసు ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రతి ఒక్కరూ ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, గ్రామ సర్పంచ్ దాసరి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ నున్న పద్మ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లే వెంకటేశు, దాసరి రాంబాబు, కొడుదుల ప్రసాద్ తదితరులున్నారు.

అసైన్డ్ భూములకు సర్వహక్కులు

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- లబ్ధిదారులకు భూ హక్కు పత్రాల పంపిణీ

కొయ్యలగూడెం: అసైన్డ్ భూములకు సర్వహక్కులు కల్పించి పేదలకు ఆర్థిక శక్తిని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో చేసిన భూ సర్వేను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధృఢ సంకల్పంతో మరోసారి నిర్వహించి సన్న, చిన్న కారు రైతులకు అసైన్డ్ భూములు, ఈనాం భూములపై పూర్తి హక్కులు కల్పించారన్నారు. మండలంలో 489 ఎకరాలకు సంబంధించి 489 మంది రైతులకు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఎంపీపీల చాంబర్ జిల్లా అధ్యక్షుడు సుంకర వెంకటరెడ్డి, స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ తాడిగడప రామకృష్ణ, సర్పంచ్‌ల చాంబర్ రాష్ట్ర ఉపాధ్యాయుడు ఏలేటి చిన్న తుక్కయ్య, ఎంపీటీసీలు ఘంటా శ్రీనివాస్, ఎస్‌కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో భూ హక్కు పత్రాల పంపిణీ

టి.నరసాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం అసైన్డ్ భూములకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పట్టాలు పంపిణీ చేశారు. మండలంలో 933 మంది లబ్ధిదారులకు 13 వందల ఎకరాలకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాలరాజు మాట్లాడుతూ అసైన్డ్ భూములు, ఈనాం భూములు, ప్రభుత్వ భూములు, గ్రామకంఠం భూములకు భూ పట్టాలు పంపిణీ చేయడంతోపాటు భవిష్యత్తులో అమ్ముకునే విధంగా పూర్తి హక్కులు ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, పామాయిల్ ఓఈఆర్ కమిటీ సభ్యులు తుమ్మూరు శ్రీనివాసురెడ్డి, సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, దేవరపల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

జర్మనీ సాంకేతికతతో చావ తయారీ గుర్తింపు

టి.నరసాపురం: జర్మనీకి చెందిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా శ్రీగంధం, ఎర్రచందనం, అగర్‌వుడ్ వంటి విలువైన మొక్కల చావ తయారీని పరీక్షించేందుకు సులభతరంగా ఉంటుందని ఏలూరు డీఎఫ్‌వో రవీంద్ర ధామా అన్నారు. ఏపుగుంటలోని తుమ్మల గార్డెన్స్‌లో శ్రీగంధం, ఎర్రచందనం, అగర్‌వుడ్ చెట్ల చావ తయారీమీద భారత ప్రభుత్వరంగ సంస్థ ఐడబ్ల్యూఎస్‌టీ (బెంగుళూరు)వారు జర్మనీకి చెందిన మెషినరీతో ఫలసాయ తయారీపై బుధవారం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటువంటి పరిజ్ఞానం ద్వారా చెట్ల ఫలసాయాన్ని పరీక్షించడం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు ఫలసాయం తయారైంది, లేనిదీ తెలుసుకోవచ్చన్నారు. ఏపీ ఫారెస్ట్ అకాడమీ సిబ్బంది, ఐడబ్ల్యూఎస్ శాస్త్రవేత్తలు, టోఫి శాస్త్రవేత్తలు, ఏపీ శ్రీగంధం, ఎర్రచందనం పెంపకందార్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి పూర్ణచంద్రరావు, తుమ్మల మురళీకృష్ణ పాల్గొన్నారు.



అగర్‌వుడ్ చెట్టు చావను జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలిస్తున్న దృశ్యం

రెండు మోటార్‌సైకిళ్లు చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో రెండు మోటార్‌సైకిళ్లుచోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివి. ఈనెల 16న స్థానిక రామచంద్రాపురానికి చెందిన మట్టపర్తి చంద్రప్రకాష్, గత నెల 14న స్థానిక పాత బస్టాండ్‌కు చెందిన గాది సురేష్ మోటార్‌సైకిళ్ల వారి ఇళ్ల వద్దే చోరీకి గురయ్యాయి. దీనిపై వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: స్థానిక రాములమ్మ చెలకలోని ఎండీ సత్తార్ ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి బుధవారం క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. ఎండీ సత్తార్ 26వ తేదీన బంధువుల ఇంట్లో పెళ్లికి ఒంగోలు వెళ్లాడు. అతని భార్య, కుమార్తె అతని సోదరుడి ఇంటికి వెళ్లారు. అయితే 28వ తేదీన ఇంటి చుట్టుపక్కల వారు సత్తార్ భార్యకు ఫోన్ చేసి తలుపులు తీసి ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆమె వెళ్లి చూసే సరికి ఇంటి తలుపులు పగులగొట్టి బెడ్‌రూమ్‌లోకి దొంగలు ప్రవేశించినట్లు గుర్తించారు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా లాకరు పగులగొట్టి అందులో ఉంచిన ఒక కాసు చైన్, అరకాసు చైన్, కాసున్నర లాకెట్, చెవిదుద్దులు అరకాసు, ఉంగరాలు రెండున్నర కాసులు మొత్తం బంగారం ఆరు కాసులు, వెండి వస్తువులు నాలుగు జతల పట్టీలు మొత్తం 54 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వాహనాల సీజ్

కొయ్యలగూడెం: రామానుజపురం సమీపంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు. 28వ తేదీ రాత్రి సమీపంలో ఏ విధమైన అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తుండడంతో ఒక జేసీబీని, లారీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు.